# కపర్ది

(కథాకృత స్వప్నము)

(ఆంధ్రపత్రిక : ఉగాదిసంచిక : 1949)

**నే**ను కపర్దిని రెండేండ్లుగా నెఱుగుదును. ఆ పరిచయము కొద్ది మాత్రము స్నేహముగా పరిణమించెను. కపర్ది యనినచో నానాటికి గౌరవము హెచ్చుచుండెను. అతని వయస్సు ముప్పది యేండ్లలోపు. వృత్తి న్యాయవాది. అందులో గిట్టింపు తక్కువయైనను పిత్రియమైన ఆస్తిమీద సాలుకు నాల్గువేల ఆదాయము వచ్చును. ఆంగ్లేయములో పట్టపరీక్ష పొందుటయే గాక సంస్కృతాంధ్రములలో చక్కని సాహిత్యము కలవాడు. సంగీతము కొంత చెప్పికొన్నాడట. భరతశాస్త్రమున లక్ష్య లక్షణములు చక్కగా తెలిసినవాడని ప్రతీతి. అతడు నన్ను తన యింటికి రమ్మని ఆహ్వానింపగా నేను అందులో నేను అతనినొక యవతార పురుషుడుగా భావించెడు నేను ఎట్లు కాదనగలను? అతనికీ, నాకు స్నేహమున్నను స్నేహము స్నేహమే. లోని మనోభావములలో అతడొక గురువు. నేనొక శిష్యుడను. చాల దినములనుండి నాహృదయములో నొక భావము "ఇటువంటి మన్మథాకార సంగీత సాహిత్య సరస్వతికి నెట్టి భార్య కలదో? ఆమె యెంత యందకత్తెయో? విద్యావతి కూడనేమో?" అని. లోపల వెళ్ళవలయు ననియే యున్నది. పైకి మాత్రము "మఱియొకసారి వచ్చెదను లెండి" అన్నాను. అతడు "నేను వెనుక రమ్మన్నప్పుడిట్లే యంటివి" అనెను. దానితో నేను తిరిగిపోయి, మాటాడకుండ బయలు దేరితిని. వారియిల్లు విశాలమైన క్రొత్త కట్టడము. ఆధునిక గృహనిర్మాణము నందలి సర్వరమ్యతయు కలదు. పోయి చావడిలో నొక పడకకుర్చీలో కూర్చుంటిని. ఎన్నాళ్ళుగానో యీ సావకాశముగా నున్నప్పుడు కొంచెము పాడుడనియు, కొంచెమభినయింపుడనియు, అతని నడుగవలయునని నాకోర్కె. ఒక అరగంట తాత్సారము చేసి చివరకు బయట పెట్టితిని. ఆయన చిఱునవ్వు నవ్వి "నేనే అభినయించవలయునా?" అనెను. నా గుండె గుబుక్కుమన్నది, "ఏమిరా! భార్యను పిలిచి అభినయింపించునా? తన భార్యచేత నా యెదుట నభినయింపించు నంతటి సౌహార్దము నాయందున్నదా?"

యనుకొంటిని. ఆయనయు "నేను కాదు. నా కుమారుని చేత నభినయింపించెద" ననెను. నా ప్రాణములు కుదుటపడినవి. నేనేమియు మాటాడలేదు. కపర్ది తన కొడుకును పిలిచెను. ఆ పిలిచినది కొడుకునేనా యని యనుమానపడితిని. ఆ పిలిచిన వాని పేరు సంస్కృతము కాదు, తెలుగు కాదు. పాశ్చాత్యుల పేరు 'రోనాల్డు' అని.

అంతనొక నాలుగేండ్ల బాలుడు మేమున్నచోటికి వచ్చెను. ఎఱ్ఱనిజుత్తు, తెల్లని మేను, పిల్లికండ్లు పిల్లవానిని చూచినంతనే పాశ్చాత్యుల పిల్లవాని వలె నుండెను. కాని ఆ కన్నులలో చూపు, పసితనము యొక్క వైఖరి, నవ్వులోని మాధుర్యము, తెలుగుతనమునే విరియించుచున్నది. నా కౌగాముల యంతు పట్టలేదు. నా నివ్వెఱను కపర్ది చూచుచునే యుండెను.

"నాన్నా! ఒక మువ్వగోపాలపద మనరా" యనెను. వాడు నన్ను చూచి సిగ్గుపడెను. ఆ సిగ్గులోని వైఖరి తెలుగు పెంపకమునే వెల్లడించెను. కపర్ది భయము లేదు. ఆయన మనవాడే నని నచ్చచెప్పి దగ్గరకు తీసికొని లాలించి, ఒక పదము మొదలందించి కుఱ్ఱవానిని ప్రోత్సహించెను. ఇంచుక సేపటిలో పిల్లవాడు సగము సిగ్గును తొలగబెట్టి తొక్కు పలుకులతో ఆపద మనుచు నడుగువేసి, చేతులు త్రిప్పి అంతలో పెద్ద సిగ్గు వచ్చి, పోయి, కపర్ది యొడిలో నుఱికి తలవంచుకొనెను. కపర్ది పకాలున నవ్వి యతని వీపు చఱచి ఎత్తికొని ముద్దాడి తీసికొనిపోయి లోన దింపి వచ్చెను. అప్పుడు నేనెట్లుంటిని? ఒక చిత్రప్రతిమ వలె నుంటిని. బహిశ్చైతన్యము మాలిన నాయెదలో నూహాపరంపర యానకట్టలేని మహానది వలె పోవుచుండెను.

ఇతడొక పాశ్చాత్య స్త్రీని వివాహమాడెనా? ఇతడు పాశ్చాత్య దేశములకు వెళ్ళినట్లెవ్వరును చెప్పలేదు. ఒకవేళ నితని భార్య పాశ్చాత్యాంగన యైనచో నింతసేపు గృహాంతర్భాగమున నేల యుండెను? ఈ పాటికే సావడి లోనికి వచ్చి తద్దేశగృహిణీ మర్యాదలు జరిపియుండును. ఇతని గృహము పూర్తిగా పాశ్చాత్య మర్యాదలతో నిండియుండును. ఈ పిల్లవాడు అప్పుడు తెలుగు మాట్లాడునా? అంతయు నాంగ్లేయములోనే భాషించి యుండును. ఏవో యిట్టియూహలు వందలు వేలుగా వచ్చుచుండెను.

కపర్ది నే నున్న చోటికి వచ్చి నా స్థితి యంతయు చూచి "ఏమి యాలోచించుచుంటివనెను. నేను నాలోనుండి చప్పున వెలికి వచ్చి "ఏమియును లేదు. ఆ పిల్లవాడు – బాగుగా నున్నది" అంటిని. కపర్ది నవ్వెనో? ముఖములో విషాదము తెచ్చుకొనెనో? ప్రాతకథ స్మరించెనో? సౌముఖ్యము వెల్లడించెనో? అన్నియు నొక్కసారిగా చేసెనో?

ఆ పాటున కూరుచుండి పది నిముసములు నాతో మాటాడలేదు. రాత్రి పదిగంటలైనది. నేను తెలివితక్కువగా మాటలాడితి ననిపించినది. నాకు ముండ్లమీద నున్నట్లున్నది. వెడలిపోవుదునని జెప్పజాలక, వెడలిపోవుటకు నా యొడలి కదలిక యంతయు నభిముఖముగా నుండగా కపర్ది యిట్లనెను. "నీ వీపూట యిచ్చటనే భోజనము చేయుదువు" అని. యతని యామాట శాసనమువలె నుండెను. అతడు శాస్త, నేను శాస్యుడను.

భోజనములైనవి. రాత్రి పదునొకండైనది. వాకిటిలో కూర్చుండి మాటాడుచున్నాము. కపర్ది లేచి, నన్ను లోనికి రమ్మనెను. ఇరువురము లోనికి పోయితిమి. ప్రక్క గదిలోనికి నన్ను తీసికొని వెళ్లెను. ఒక మంచము మీద మెత్తని పఱుపుల మీద రోనాల్డు నిదుర పోవుచుండెను. కపర్ది మంచము వద్ద నిలుచుండి వానివంక చూచుచుండెను. నేను చూచితిని. మాటాడకుండ నతడు గది వదలి వెళ్ళెను. నేనతని ననుసరించితిని. బయట కుర్చీలలో కూర్చుంటిమి. అతడిట్లు చెప్ప నారంభించెను......

## కపర్దికథ

### (1)

నాకప్పుడు ఇఱువది రెండేండ్లు. నా తల్లిదండ్రులు చిన్నతనములోనే పోయిరి. నా యాస్తిని రక్షించిన ఒక్క మేనమామయు నా యిఱువదవ యేటనే మరణించెను. నేనప్పటికి రెండేండ్లనుండి నా వ్యవహారములు చూచుకొనుచుంటిని. సాలున కైదువేలు దాటియే నా కాదాయము వచ్చును. నీవు వినియుందు వనుకొందును. మా మేనమామ బ్రతికియున్నయప్పుడు వివాహము చేయవలయునని యెంతయో ప్రయత్నించెను. నేను బి.ఏ. పరీక్ష యిచ్చిన గాని వివాహము చేసికొననంటిని. నామొండిపట్టు చూచి యాయనయు, వచ్చిన

వందు సంబంధములను త్రిప్పివేసెను. ఆయన పోయిన తరువాత పిల్లనీయ వలయునని వచ్చి నన్నే యడుగవలయును. నన్నెవ్వరు వచ్చి యడుగలేదు. సాహసించి యడిగిన యొకరిద్దరిని పుల్లవిఱుపు మాటలతో పంపించితిని.

ఇంతకు- నేను వివాహము చేసికోనిష్టము లేక కాదు. దానికి వేఱే కథయున్నది. వినుము. ఒక స్నేహితుని పెండ్లికి నేనొక పల్లెటూరు పోయితిని. వారొక భోగము మేళమును తెచ్చిరి. నాకు భరతశాస్త్రమునందభినివేశము కలదని తెలిసి స్నేహితులందరు వారభినయించువేళ నన్ను ముందుకు ద్రోయుచుండిరి. ఆ మేళములో నొక పదునాలుగేండ్ల పిల్ల, దాని కనుముక్కు తీరు, శరీరచ్ఛాయ, ఆ పెదవుల రెంటి కలయిక, ఆ చెక్కిళ్ల మీదకు జారుచున్న కంటితుద కాంతి, అఁటిచెట్టు క్రొత్తగా గెల విడుచునప్పటి చివరి సన్నని పూబొటమరింపువోని దాని జవ్వనపు తొంగిచూచుట - దాని కన్నులలోని యమాయకత్వము ఏదైన ప్రేరితమో, స్వకీయమో అది మాటిమాటికి నావంకనే చూచుట, చిఱుతసిగ్గులు పిసాళించుట - ఇది యంతయు నాకొక యనుభూతి విశేషమైపోయెను. పెండ్లి నుండి తిరిగి వచ్చితిమి. నాకు నిద్దురపట్టలేదు. అన్నము రుచించలేదు. పెద్దవారు లేరు గనుక నామనస్సు విపరీతపు త్రోవల పోవుచున్న దనుకొంటిని. ఎంత విచారించినను దానిలో నాకు వైపరీత్యము కనుపించలేదు. నేను పెండ్లి చేసికొన్నచో ఆపిల్లనే చేసికొందును. నేనెవరు? అది యెవ్వరు? నేను సంఘ సంస్కారిని కాదు. సంస్కార భావములందు నా మనస్సులో నిదివఱకెప్పుడును ఆదరభావము లేదు. నిరాదరము లేదు. ఆ పిల్లను నేను పెండ్లిచేసికొందునను కొన్నది సంస్కార బుద్ధిచేతనే కాదు - భగవంతుడు దానిని నాకై నిర్మించెను. నన్నామెకై నిర్మించెను. అరే! నేనింత తద్వశుడ నైపోతిని. ఆమెయు రోయి యింటి బాలిక. ఆమె నా కోసము సౌశీల్యవతియై యుండునా? నేను విటకాడనై యుందునా? ఛీ! ఛీ! ఎంత గాదనన్నను నన్ను నేను కాదనుకొనలేకపోతిని. అప్పటినుండి తొందరపుట్టెను. వారిది యేయూరు? ఆ వివాహమైన మిత్రుని కనుగొంటిని. వారందరు నవ్విరి. నేనా గ్రామమునకు పోయి వారి యిల్లు కనుగొని, ప్రొద్దుగ్రుంకిన తరువాత దొంగచాటుగా వారియింటికి పోయితిని. నాకచ్చట తేళ్ళమీద కూర్చున్నట్లుండెను. అచ్చటి యా యసహ్యామైన గోల యెందులకు?

వారందరు నేను కన్నెరికము పెట్టుటకు వెళ్ళితి ననుకొన్నారు. నేనును క్రమముగా తెలియజేయ వచ్చుననుకొంటిని. ఆ బాలిక పేరు మృణాళిని.

మృణాళినియు, నేనును సంవత్సరము కలిసియుంటిమి. స్నేహితులలో నన్ను గూర్చి వేలు వదంతులు బయలుదేరినవి. నేనెన్నిసార్లు ప్రస్తావన చేసినను దాని తల్లి "తరువాత పెండ్లి చేసికొనవచ్చును. తొందరయేమి?" యని యెలయించెను. మృణాళినియు, నేనును మాత్రము భార్యాభర్తల వలె నుంటిమి. ఆమెకు నేను భరతాభినయము చాల నేర్పితిని. దానిగొంతు పైడి తీగ.

ఆమెతో నేను కలిపి యనుభవించుచున్న బ్రహ్మానందములో వివాహము చేసికొనవలయు నని కాని, యామెను దుష్టసంపర్కమునుండి వెలికి తేవలయునని గాని యెప్పుడును నిష్ఠగా పూనలేదు. ఆ యేడాది చివఱకు వచ్చిన కొలది దాని తల్లియు, నప్పలును దానిని నావెంట పంపించరను విషయము కొంత కొంత నాకు గోచరించినది. నేను రమ్మన్నచో మృణాళిని నావెంట వచ్చెడిదే, అప్పటికది పదునైదేండ్లపిల్ల. నేనా ప్రయత్నము చేసితిని. దానికి మైనారిటీ వెళ్ళలేదు. కనుక నేను తీసికొనిపోయినచో నాపై నభియోగము చేయుదుమని వారు బెదరించిరి. నేనేమి చేయవలయునో నాకు తెలియలేదు. ఒకనాడు రాత్రి నేనును, మృణాళినియు కౌగిలించుకొని యేడ్చితిమి. నా మనస్సులో నొక్క యనుమానము. మృణాళినికి మా బంధములోని పవిత్రత తెలుసుకొను నంతటి వయఃపరిణతి కలుగలేదని. ఆ యేడాదిలో వారికి నేనెంతయైన డబ్బు నిచ్చితిని. వివాహమునకు వారంగీకరించని వేళ నుండి నేను ధనమిచ్చుట యాగిపోయెను. పరిస్థితులు చమత్కారముగా మాఱెను. ఒకరోజున నేను పోగా మృణాళిని బంధువుల యింటికి పోయినదనిరి. వారము గడచెను. నామనస్సు మాఱిపోయెను.

నేను అప్పటికే బి.ఏ పరీక్ష యై యుంటిని. ఆ కోపములో, ఆ దుఃఖములో నేను ఒకనాటి సాయంతనమున నాకు నాకే తెలియకుండ మద్రాసుపోయి లా కాలేజిలో చేరితిని. రెండేండ్లు నా చదువు, నేను! మృణాళిని ప్రతినిశా భాగమునందును నామనస్సు లోపలనే యుండెను. పగలామెను మఱచిపోవు చుంటిని. ప్రతినిశా పరభాగవేళయందు గాఢాలోచనా పర్యవసన్నమైన దొక్కటే నిశ్చయము. ఆమె నాభార్య. నేను మఱొకర్తెను వివాహమాడను. ఆమెను

దాని తల్లి, యప్పలు వృత్తిలోనికి దించెదరేమో? దించినను దానిని నేను స్వీకరించెదను. ఆమె యంగీకరించనిచో జీవితాంత మిట్లె తద్వ్రతుడనై బ్రహ్మచర్య మవలంబింతును.

**(2)**

న్యాయవాది పరీక్షయందుత్తీర్ణుడనైతిని. మదరాసు నుండి యెకాయెకి వారి యూరే పోతిని. ఆ యూరిలో నా స్నేహితులు నన్ను వారి యింటికి రమ్మని పిలిచిరి. నేను రానంటిని.

"ఓయీ! నీకింకను దానిమీద యాశ వదలలేదు. దానికేమి? ఆమె యభినయము చూచితీరవలెను. ఈ రెండేండ్లుగా నామె పేరు మోసినది. భరతశాస్త్రములో నంతటి విద్యాశాలిని యీ ప్రాంతములందు లేదట. ఆమె నెవ్వరు పిలిచినను రాదు. మేళము కట్టదు. మాకామె యభినయము చూడవలయునని యున్నది. నీవు వచ్చినచో మాకది సులభముగా సమకూరును" అనిరి. మఱియు మృణాళినిని గురించి చిత్రచిత్రములైన కథలు చెప్పిరి. ఆమె కొకకొడుకట. ఒక దొర, పాశ్చాత్యుడు ఆమె నుంచుకొనెనట. ఏడాదిగా నామె కాంగ్రెసులో వాలంటీరుగా చేరెనట. నిత్యము ఖద్దరునే కట్టునట. ఆఱు నెలలనుండి క్షయవ్యాధియేమో యనుకొనుచున్నారట. ఒక వార్త కాదు. తల దిమ్మెక్కిపోయింది. వైముఖ్యమెంత కల్గినదో నా సర్వాశలు నెంతక్రుంగినవో; పోయి యామెను చూడవలెనన్న నా సర్వాశలు చెలరేగుట మఱల నంత జరిగినది. వారి వెంటబడి నా కాళ్ళే నన్నచ్చుటి కీడ్చుకొని పోయినవి.

పోయి, వారి సావడిలో కూర్చుంటిని. మేమచ్చట కూర్చుండి యుండగనే మృణాళిని యచ్చటకు వచ్చెను. ఒక తెల్లని చీర ధరించియుండెను. మనిషి శుష్కించినట్లు లేదు. నేనామె వంక నివ్వెరపోయి చూచితిని. ఆమె నావంక చూచి యాశ్చర్యపోలేదు. ఆనందపడలేదు. క్రొత్తదనము ననుభవింపలేదు. రెండేండ్ల క్రింద మేమిర్వురము కలిసియుండెడినాడు నన్నెంత చనువుతో, పరమానుబంధముతో చూచినదో, అట్లే నాయందు ప్రవర్తించెను. వీరు చెప్పిన కథలన్నియు నిజములా? అబద్ధములా?

అప్పుడు వారందరును "నీ అభినయము చూడవలయునని వచ్చితిమి" అని యడిగిరి. ఆమె వెంటనే వచ్చి నన్నానుకొని నిలుచుండి, రెండేండ్ల క్రింద నేనేదైన పాడుమనగా నన్నెట్లడిగెడిదో, అట్లే అడిగెను. తన వక్షస్థలము నా వామభుజమున కాన్చి " ఏ మభినయించమందురు?" అని

ఆమె శరీరము నా యొడలికి తాకినంతనే యామె యొడలు తీవ్రజ్వరము చేత మండిపోవుచున్నట్లు తెలిసెను. ఆమె జ్వరబాధ ననుభవించుటలేదు. నాకు చిత్ర మనిపించెను. అంతమందిలో నాసంగతి నేనామెతో నేమని ముచ్చటింతును. ఆమెకు నేను నేర్పిన కీర్తన నొకటి పాడుమంటిని. ఆ కీర్తనలోని భావము "తల్లి తన పిల్లను ముద్దాడుట" మృణాళిని యా కీర్తన నభినయించెను. అట్టి దివ్యమైన యభినయము నేనెచ్చటను చూడలేదు. నేనామెకు నేర్పలేదు. అయ్యయ్యో! ఆకన్నులలోని వాత్సల్యము, పిల్లవంక చూచుచున్నట్లు మొగము వంపగా నామె చిబుకమును, కపోలాథో భాగములు పొందిన వక్రుతనము నిప్పటికి నా కన్నులకు కట్టినట్లే యున్నది. నేను నా మనస్సు ఒత్తిడి యోర్చుకొనలేకపోతిని. ఆ యభినయభారము చేత నామె తూలి పడిపోవునేమో యనుకొంటిని. నాహృదయోద్వేగము నేను పట్టుకొనలేక ఎవ్వరితో మాటాడకుండగనే నే నచటినుండి వెడలిపోయితిని.

**(3)**

వారియూరికి యుత్తరాభిముఖముగా పోగా దారిలో నొక వాగుండెను. ఆ వాగు సర్వఋతువుల యందును ప్రవహించుచుండును. ఆ వాగుమీద వంతెన లేదు. జనమందరు దిగియే పోవుదురు. ఆ వాగు దాటిన తరువాత క్రొత్త పట్టణమంతయు బలిసెను. వారి యిల్లు ప్రాత పట్టణములో నున్నది. ప్రాతయూరు వాగున కివతల.

అప్పటికి ప్రొద్దు క్రుంకవచ్చుచున్నది. నేను విషాదమగ్న హృదయుడనై వాగుదాక పోయితిని. ప్రక్కనెవరో నడచి వచ్చుచున్నట్లుండెను. తలయెత్తి చూడగా మృణాళిని. దాని చంకను ఈ పిల్లవాడుండెను. అప్పటికి వీడు ఏడాది పిల్లవాడు. ఆమె జరీపేటంచుల జరీగళ్ళ పొందూరు చీర దాల్చియుండెను. నేనామె నేమియు నడుగలేదు. ఆమె నాతో నేమియు చెప్పలేదు. నేనడుగకుండ నామె చెప్పకుండ

నామె నాతో వచ్చివేయుచున్నదని నాకు తెలియును. వాగు దగ్గరకు చేరు వేళకు కొంచెము చీకటి పడినది. కాని వచ్చిపోవు జనము ఒకరికొకరు కనిపించుచునే యుండిరి. వాగులో నీళ్ళు మోకాలిపైకి వచ్చుచుండెను. మృణాళిని దిగినచో నామెచీరయంతయు తడిసిపోవును. నేనామెను రెండు చేతులతో నెత్తుకొని వాగులో నడచితిని. జనమందరు నావంక విచిత్రముగా చూడసాగిరి. క్రొత్తయూరిలో నొక పెద్ద మేడలో హోటలుండెను. అది యొక యయ్యరు హోటలు. నేనామె నెచ్చటకు తీసికొని పోవలయును? ఆమె కొక గది తీసికొని మఱునాడు ఈ యూరు తీసికొని రావలయునని తలంచినాను. అయ్యరును ఒక గది యిమ్మంటిని. అతడు ఖాళీలు లేవనెను. చివరకు మేడ చివరి భాగములో నొక గది ఖాళీచేసి యిచ్చెను. నేను మృణాళిని నందు కూర్చుండబెట్టితిని. "నిన్ను నేనిప్పుడు తీసికొని పోయినచో లోకమేమందురు? నేను వివాహమాడుటకు నీవిప్పుడు తగినదానవు కావు. నీవు పోయి నీ తల్లి దగ్గర నుండుము. నేనిట్లే జీవితాంతము నీవే నా భార్యవనుచు బ్రహ్మచారినై యుందు" నంటిని. అని పోయి భోజనము చేసి మఱల వచ్చితిని, అప్పటికి ఆమె తల్లియు అప్పగార్లును గదిలో నుండిరి. వారామెను తిరిగి యింటికి రమ్మనిరి కాబోలు. నేను మృణాళినియు దాని బంధువులును గలసి యుండుట చూచి యచటినుండి వెడలిపోయి యారాత్రి గదిలోనికే పోలేదు. నాకు తెల్లవారలు నిద్రయును లేదు.

ఆమె తన తల్లివెంట పోయి యుండునని ధృఢవిశ్వాసము. వెడలిపోదని మనసులో నొకచోట చిన్నియాశ, అనుమానము.

మఱునాడు నేనచటికి పోగా నామెయు పిల్లవాడును అచటనే కూర్చుండియుండిరి. నేను "నీవు వెళ్ళిపోలేదా?" అని అడిగితిని. ఆమె మాటాడలేదు. ఆమె మీద నా గుండెలో మేరు పర్వతమంత మహానురాగము, ప్రతినిమేషమున కౌగలించుకొని మనము వివాహమాడి సుఖముగా నుందమని చెప్పవలయు నన్నంత యాభిముఖ్యము. ఇంతటి మనోవాంఛా ప్రవాహమును – ఏదో ఒక చిన్న వెలిబిగువు, గడ్డిపఱక యంతటిది – ఆనకట్ట కట్టి నిలుపుచుండెను.

మఱల కొంతసేపు చూచి సాయంకాలమునకు నామె యట్లే యుండినచో నామెను తీసికొని పోదునని అనుకొన్నానో యేమో అచటినుండి వెడలిపోతిని.

తరువాత రెండు గంటలైన కాలేదు. దారిలో సత్యాగ్రహము జరుగుచుండెను. అజ్ఞోల్లంఘనము చేసి విచ్చిపోవని జనసముదాయమును వితియజేయుటకు రక్షకభటులు తుపాకులు ప్రేల్చిరనియు, ఒక దెబ్బ తగిలి మృణాళిని చనిపోయెననియు నెవ్వరో ఇంతలో చెప్పిరి. నేనామెను పోయి చూచితిని. ఆమె గతాసువై యుండెను.

వెంటనే ఆ పిల్లవాడేమయ్యెనో అన్నభావముతో హోటలుకు పోయితిని. ఆ పసివాడు గిలగిల కొట్టుకొనుచు నేడ్చుచుండెను. నేను వీనిని మృణాళిని తల్లికి తీసికొనిపోయి యొప్పగించవలె ననుకొంటిని. ఇంతలో దుఃఖించుచున్న మృణాళిని తల్లియు, బంధువులును వచ్చిరి. వారు కుఱ్ఱవాని వంక చూడలేదు. నా వంకను చూడలేదు.

నేను కుఱ్ఱవానిని తెచ్చుకొంటిని. వారి ప్రసంగము వలన నితని పేరు 'రోనాల్డు' అని తెలిపెను. ఈ బాలుడు నేనే తండ్రి ననుకొనుచున్నాడు. ఒక విధముగా తండ్రినే కదా! కాని నేను తెలుసుకోలేని దొక్క విషయమే. మృణాళిని నన్ను వదలి అట్లేల ప్రవర్తించెనో అని. నాకు తరువాత తెలిసినది. ఆమెను దాని తల్లియు అప్పలును చాల బాధలు పెట్టిరట. భరింపలేక ఎదిరించు శక్తిలేక, వయస్సులేక, ఆధారము లేక వారి బలవంతమునకు లొంగవలసి వచ్చినదట.

***

అని కపర్ది పుచ్చిన నిశ్వాసము నాగుండెలో పదిమైళ్ళ లోతున దిగబడెను. ఆ రాత్రి నేను వారి యింటిలోననే నిద్రించితిని. కపర్దిని నేనోదార్చవలయునో, సానుభూతి తెలుపవలయునో, నీవు మహాపురుషుడవని ప్రశంసించవలయునో కులభ్రష్టుడ వని నిందింపవలయునో నాకేమియు తెలియలేదు. అతడన్నచో మనస్సులో మహాగౌరవమేర్పడినది.

తెల్లవారుకడ కొంచెము నిద్రపట్టినది. కపర్ది వచ్చి నన్ను నిద్రలేపెను. కాఫీకి తొందరపెట్టెను. ఈ కపర్ది రాత్రి చెప్పిన కపర్దికాడు. పరమోత్సాహవంతుడు. పరిహాసవాక్కు. అతని నవ్వు వెన్నెలల ముందు సర్వవిషాదాంధకారములు తొలగిపోవును. నేను రెండేండ్లుగా అప్పుడప్పుడు కలసికొన్న రసజ్ఞ శేఖరుడును, కళాజీవియు, మధురభాషియునగు కపర్ది యితడు.